చురకలు

ఆదివారం 17 మే 2026

## నీట్ పేపర్ లీకేజీతో విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకం



**వరంగల్:** నీట్ పేపర్ లీకేజీ కారణంగా దేశ వ్యాప్తంగా సుమారు 22లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడిగా నిర్వహించే ప్రవేశ పరీక్షలతో ముఖ్యంగా దక్షిణ భారత విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను రాష్ట్రాల పరిధికి పరిమితం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న సుందర విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ను వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార నరేష్, విజృంభన విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్తను వేరు చేయాలి



**తాండూర్:** తడి, పొడి చెత్తను వేరు చేయాలని మండల పంచాయతీ అధికారి జి.అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని కిష్టంపేట గ్రామపంచాయతీని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, ఎక్కడా ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సిగ్రిగేషన్ షెడ్‌కు తరలించి ఎరువు తయారు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా నర్సరీ నిర్వహణ, పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని పంచాయతీ కార్యదర్శికి సూచనలు జారీ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న సెన్సస్ హౌస్ లిస్టింగ్ ప్రక్రియను సూపర్‌వైజర్ రత్నయ్యతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఉదయ్ రాంప్రసాద్, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## పదవ తరగతి ఫెయిల్ విద్యార్థులకు మరో అవకాశం



**కాగజ్నగర్:** రాష్ట్రంలో సీసీఈ విధానం 2015 సంవత్సరంలో అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రభుత్వం మరో అవకాశాన్ని కల్పించినట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. ఈ ఏడాది జూన్ 5 నుంచి నిర్వహించనున్న పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు అర్హులైన విద్యార్థులు హాజరుకావచ్చని పేర్కొన్నారు. పరీక్షలకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇప్పటినుంచే పరీక్షలకు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు.

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఆన్‌లైన్ సెమినార్



**కాగజ్‌నగర్:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలను పురస్కరించుకొని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)పై ఆన్‌లైన్ సెమినార్ నిర్వహించారు. కళాశాల ఐక్యూఏసి విభాగం ఆధ్వర్యంలో ఏఐ పవర్డ్ లెర్నింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ స్మార్ట్ ఎడ్యుకేషన్ అనే అంశంపై ఈ కార్యక్రమం చేపటాటరు. సెమినార్‌కు ఎస్ఆర్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.కార్తిక్ రెడ్డి ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. భవిష్యత్ విద్యారంగంలో ఏఐ కీలకపాత్ర పోషించనున్నప్పటికీ, అది ఉపాధ్యాయుల స్థానాన్ని పూర్తిగా భర్తీ చేయబోదని పేర్కొన్నారు. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతిఒక్కరూ అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్మార్ట్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన వివిధ అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ ప్రస్తుతం ఏఐ అన్నిరంగాల్లో వేగంగా విస్తరిస్తోందని అన్నారు. ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఇ.శారద మాట్లాడుతూ భవిష్యత్తులో ఏఐ మన నిత్యజీవితంలో భాగమవుతుందని, ప్రతిఒక్కరూ ఆ దిశగా తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. అనంతరం విద్యార్థులు ఏఐకు సంబంధించి అడిగిన పలు సందేహాలను డాక్టర్ కార్తిక్ రెడ్డి నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం, అకాడమిక్ కోఆర్డినేటర్ డి.జనార్దన్, అధ్యాపకులు ఎం.రాజేశ్వర్, వి.దేవేందర్ రెడ్డి, రోజ్ మేరి, వెంకటేశం, కృష్ణవేణి, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డెంగ్యూ నివారణ మన అందరి బాధ్యత




**తాండూర్:** డెంగ్యూ నివారణ ప్రతిఒక్కరి బాధ్యత అని తాండూర్ పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ఝాన్సీ అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శనివారం తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో దోమల వృద్ధికి అనుకూలమైన ప్రదేశాలను గుర్తించి నీటి నిల్వలను తొలగించాలని, నిల్వ నీటిపై మూతలు పెట్టాలని సూచించారు. వారానికి ఒకసారి నీటి నిల్వలను పూర్తిగా ఖాళీ చేసి శుభ్రం చేయాలని తెలిపారు. పూల కుండీలు, కూలర్లు, పాత టైర్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా తాండూర్ పీహెచ్‌సీలో ప్రజలు, రోగులకు డెంగ్యూ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం డెంగ్యూ నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరుతూ ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు పీహెచ్‌సీ సిబ్బంది, ప్రజల ఆధ్వర్యంలో డెంగ్యూ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్ హకీమ్, సీహెచ్‌ఓ జయ మేరీ, సూపర్వైజర్లు తార, రమాదేవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## మార్కెట్ యార్డులో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం





**తిర్యాణి:** మండల కేంద్రంలోని గంభీరావ్‌పేట్ వ్యవసాయ గోదాం మార్కెట్ యార్డులో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని తహశీల్దార్ శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ధాన్యం నిల్వలు, తేమ శాతం పరీక్షించే యంత్రాలు, గన్నీ బ్యాగుల లభ్యతను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా ఉంటే వెంటనే కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. కావాలని కోతలు విధించడం, రైతులను రోజుల తరబడి వేచి ఉంచడం వంటి చర్యలు చేయవద్దని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి భద్రపర్చాలని సెంటర్ ఇన్‌చార్జీలకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు త్వరితగతిన లారీల ద్వారా తరలించాలని తెలిపారు. అలాగే దళారుల జోక్యం లేకుండా రైతులకు న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. రైతులు కూడా ఎండబెట్టిన, చెత్తలేని ధాన్యాన్ని మాత్రమే కేంద్రానికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జమ్మిడి కిష్టయ్య, ఉప సర్పంచ్ రాజకుమారి, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, ఆసిఫాబాద్ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ వేముల లత, వ్యవసాయ అధికారులు వినయ్, ముత్తయ్య, ఏపీఎం శ్రీనివాస్, ఎస్ఈఆర్పీ సిబ్బంది, సెంటర్ ఇన్‌చార్జి శ్యామ్‌లాల్, గ్రామ సంఘాల ప్రతినిధులు, వీఓఏలు, అకౌంటెంట్ రాజ్‌కుమార్, రైతులు, మహిళలు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐతో భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు




**నేరడిగొండ:** ఏఐతో భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, ఏఐపై అవగాహన పెంచుకోవాలని నేరడిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శబాన తరన్నం అన్నారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' ఆరవ రోజు కార్యక్రమంలో భాగంగా శనివారం కళాశాల ఆవరణలో విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో ముందుకు సాగాలంటే ఏఐపై పట్టు అవసరమని పేర్కొన్నారు. అధ్యాపకులు జనార్దన్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, మమత, ప్రవీణ్ ఏఐ ప్రాముఖ్యత గురించి వివరించారు. విద్యార్థులు ఏఐని సరైన విధంగా వినియోగించుకుంటూ ముందుకు సాగితే విద్యలో కఠినమైన అంశాలను సులభంగా అర్థం చేసుకోవచ్చని, భవిష్యత్తులో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## శివాలయంలో బోరంచు దంపతుల ప్రత్యేక పూజలు



**ఆదిలాబాద్:** మావల మండల కేంద్రంలోని శివాలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రవీణ్ శర్మ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణాల మధ్య స్వామి వారికి భక్తిశ్రద్ధలతో అభిషేకం జరిపారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి – సరిత దంపతులు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివలింగానికి ప్రత్యేక అభిషేకం చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తమ సొంత గ్రామంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. గ్రామ ప్రజలు ఐక్యంగా ఉంటూ సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమని కొనియాడారు. పరమశివుని ఆశీస్సులతో నియోజకవర్గం, మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ శాంతులతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయంలో భవిష్యత్‌లో నిర్వహించనున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రతి ఇంటి నుంచి భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

**• రూ.60 లక్షలతో సీసీ రోడ్లు**

**సత్తుపల్లి:** మండలంలోని రుద్రాక్షపల్లి పంచాయతీ పరిధిలో గల సత్యంపేట గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ దంపతులు నిలబెట్టుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సత్యంపేట గ్రామం అభివృద్ధి లోపంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గత 20 సంవత్సరాలుగా గ్రామానికి సరైన అభివృద్ధి జరగలేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మౌలిక వసతులు లేక పోవడంతో ఎన్నికలను బహిష్కరిస్తామని కూడా ప్రకటించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రస్తుత సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ గ్రామాన్ని సందర్శించి, సత్యంపేట గ్రామ అభివృద్ధి బాధ్యతను తమదిగా తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ రూ.60 లక్షల వ్యయంతో 12 సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయించారు. దీంతో గ్రామంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న అనేక ఇబ్బందులు తొలగిపోయాయి. ఎన్నికల



సమయంలో ఇచ్చిన హామీలను కార్యరూపంలో చూపిస్తూ గ్రామ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, డాక్టర్ మట్టా దయానంద్ దంపతులను సత్యంపేట గ్రామ ప్రజలు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

# వడ్దూర్, లింగట్ల మీదుగా కొత్త ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభం

**నేరడిగొండ:** గ్రామీణ ప్రాంత ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మల్ ఆర్టీసీ డిపో నుంచి నేరడిగొండ, వడ్దూర్, ధన్నూర్ మీదుగా బోథ్‌కు, అలాగే లింగట్లకు ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు నిర్మల్ డిపో మేనేజర్ కె.పండరి శనివారం తెలిపారు. నిర్మల్–బోథ్ రూట్‌లో నడుస్తున్న బస్సు ప్రతిరోజు ఉదయం 8 గంటలకు నిర్మల్ నుంచి బయల్దేరి 8.55 గంటలకు నేరడిగొండ చేరుకుంటుంది. అనంతరం వడ్దూర్, బొండిది, దర్బా, ధన్నూర్, కుచలాపూర్ మీదుగా 9.40 గంటలకు బోథ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 9.45 గంటలకు బోథ్ నుంచి బయలుదేరి 10.30 గంటలకు నేరడిగొండకు చేరుకుని, 10.35 గంటలకు కుంటాల మీదుగా 11 గంటలకు నిర్మల్ చేరుకుంటుంది. సాయంత్రం వేళల్లో ఈ బస్సు 3.10 గంటలకు నిర్మల్ నుంచి బయల్దేరి 4.05



గంటలకు నేరడిగొండ చేరుకుని వడ్దూర్, ధన్నూర్ మీదుగా బోథ్ చేరుకుంటుంది. అనంతరం 5 గంటలకు బోథ్ నుంచి బయల్దేరి 5.45 గంటలకు నేరడిగొండ, 6.10 గంటలకు కుంటాలకు చేరుకుని రాత్రి 7.30 గంటలకు నిర్మల్ చేరుకుంటుంది. అలాగే నిర్మల్–లింగట్ల సర్వీసు ఉదయం 7 గంటలకు నిర్మల్ నుంచి అనంతపేట్, నీలాయిపేట్, మేడిపెల్లి, మొండిగుట్ట తాండ్ర మీదుగా 8.20 గంటలకు లింగట్ల చేరుకుంటుంది. తిరిగి 9.30 గంటలకు నిర్మల్ చేరుకుంటుంది. సాయంత్రం 4.40 గంటలకు నిర్మల్ నుంచి బయల్దేరి 5.50 గంటలకు లింగట్ల చేరుకుని, 5.50 గంటలకు తిరుగు ప్రయాణమై నిర్మల్‌కు చేరుకుంటుంది. ఈ కొత్త బస్సు సర్వీసులను గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రైతుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

**• ఆదిలాబాద్ మార్కెట్ యార్డును తనిఖీ చేసిన కలెక్టర్**



**ఆదిలాబాద్:** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తక్షణమే సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో నేరుగా మాట్లాడి కాంటా నిర్వహణ, పట్టీల జారీ, మార్కెట్‌లో మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. రైతుల నుంచి వచ్చిన సమస్యలపై సానుకూలంగా స్పందించి రద్దీ నివారణకు ప్రస్తుత కాంటాలకు అదనంగా మరో ఐదు కాంటాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వృద్ధ రైతులకు ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన కాంటా ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా రైతులకు నీడ కోసం టెంట్లు, షామియానాలు ఏర్పాటు చేయాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. మార్కెట్‌లో మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. రాత్రి వేళల్లో రైతుల పంట భద్రత కోసం మార్కెట్ యార్డ్‌లో నైట్ సెక్యూరిటీని మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌కు అధికంగా జొన్న పంట వస్తోందని, రోజుకు సుమారు 20వేల గన్ని సంచులు చేరుతున్నాయని తెలిపారు. రవాణా, హమాలీల కొరతను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అంతకుముందు కలెక్టర్ రాంపూర్ రోడ్‌లోని చాణక్య జిన్నింగ్ మిల్లును సందర్శించి 90వేల బస్తాల సామర్థ్యం గల గోదామును పరిశీలించారు. పంట దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ఆర్ఎస్. చిత్రు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మార్కెటింగ్ అధికారి గజానన్, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

# ఎట్టకేలకు తీరిన లోవోల్టేజ్ సమస్య

**నూతన ట్రాన్స్ఫార్మర్ ప్రారంభం**

**నేరడిగొండ:** మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ, మథుర నగర్ కాలనీ వాసులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న లోవోల్టేజ్ సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. కాలనీలు ఏర్పడిన నాటి నుంచి వోల్టేజ్ హెచ్చుతగ్గుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. వోల్టేజ్ సమస్యతో ఇళ్లలోని టీవీలు, మోటార్లు, ఫ్రిడ్జ్లు, ఫ్యాన్లు తరచూ కాలిపోవడంతో కాలనీవాసులు భారీగా నష్టపోయారు. సమస్యపై పలుమార్లు అధికారులకు విజ్ఞప్తులు చేసినప్పటికీ పరిష్కారం లభించలేదు. ఈ సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే, విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో చర్యలు ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్ ప్రత్యేక చొరవతో కొత్త ట్రాన్స్ఫార్మర్ మంజూరు చేయించి ఏర్పాటు చేయించారు. సాంకేతిక కారణాలతో కనెక్షన్ ఆలస్యం కాగా, శనివారం సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుడు సాబ్లే సంతోష్ సింగ్ విద్యుత్ శాఖ సిబ్బంది, కాంట్రాక్టర్‌తో కలిసి నూతన ట్రాన్స్ఫార్మర్‌కు కనెక్షన్ ఇచ్చి ప్రారంభించారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న మథుర నగర్, ఇందిరమ్మ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించినందుకు స్థానిక ఎమ్మెల్యే, గ్రామ పంచాయతీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.



# సమృద్ధిగా వర్షా లు కురవాలని 'బుడ్ బావై' పూజలు

**• గూడాల్లో సందడిగా సాగిన 'కప్ప తల్లి' ఆట**



**నేరడిగొండ(ఇచ్చోడ):** ఇచ్చోడ మండలంలోని బాదిగూడ గిరిజన గ్రామంలో సాంప్రదాయ 'బుడ్ బావై' పేరిట శనివారం గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాబోయే కాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ మృగశిర కార్తెకు వారం రోజుల ముందు నుంచే ఆదివాసీ గూడాల్లో ఈ 'బుడ్ బావై' (కప్ప తల్లి) వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ వేడుకల్లో భాగంగా గూడాల్లోని చిన్నారులు, యువకులు ఒక రోకలికి కప్పను కట్టి, నడుముకు, కాళ్లకు గజ్జెలు కట్టుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కప్పను కట్టిన రోకలిని భుజాలపై మోస్తూ గజ్జెల చప్పుళ్లతో సాంప్రదాయ నృత్యాలు చేస్తూ గూడెంలోని ప్రతి ఇంటికీ తిరిగారు. చిన్నారులు కప్పతల్లితో ఇంటి ముందుకు రాగానే గృహిణులు, మహిళలు భక్తిశ్రద్ధలతో రోకలికి కట్టిన కప్పపై నీళ్లు పోసి అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా సాగిన ఈ వేడుకలతో బాదిగూడ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ సిడం లక్ష్మి కాంత్, దేవరి పేందూర్ బండి, పెందూర్ రెడ్డి, పేందూర్ నాగు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

## ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కోశాధికారిగా రంజాన్ బీ ఎన్నిక



**సత్తుపల్లి:** భారత జాతీయ మహిళా సమైక్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఖమ్మం జిల్లా మహాసభల్లో వేంసూరు మండలానికి చెందిన ఎస్.కె. రంజాన్ బీని జిల్లా కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వేంసూరు గ్రామానికి చెందిన రంజాన్ బి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లో చురుకుగా పనిచేస్తూ పేదలు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నారని నాయకులు తెలిపారు. మహిళా హక్కుల పరిరక్షణలో ఆమె కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల కోసం ఉద్యమాలు, గ్యాస్ కంపెనీ ఏర్పాటు కోసం పోరాటం, డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో మంచినీటి సమస్యల పరిష్కారం, రోడ్ల నిర్మాణం, ఒంటరి మహిళలకు పెన్షన్లు, ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం వంటి పలు ప్రజా సమస్యలపై రంజాన్ బీ పోరాడుతూ ప్రజల్లో గుర్తింపు పొందారు. ఆమె జిల్లా కోశాధికారిగా ఎన్నిక కావడం పట్ల సీపీఐ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## గ్రామానికి గర్వకారణంగా నిలిచిన విద్యార్థినికి సన్మానం



**కాగజ్నగర్:** కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామానికి చెందిన వాడే నాగేష్–వాడే గాయత్రి దంపతుల కుమార్తె వాడే అవంతిక జెడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో టాపర్‌గా నిలిచి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వసాకే పుల్లబాయి, కాగజ్‌నగర్ మండల మాలి సంఘం జనరల్ సెక్రటరీ వసాకే హనుమంతు, గ్రామ పెద్దలు అవంతికను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు.

## పెట్రోల్ ధరల పెంపుపై శ్రీకర్ గౌడ్ మండిపాటు



**ఆదిలాబాద్:** ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడంపై ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా బీజేపీ రాజకీయం సాగుతోందని విమర్శించారు. ఎన్నికల ముందు ధరలు పెంచకుండా నాటకాలు ఆడి ప్రజలను ఆకర్షించి, ఎన్నికలు ముగిసిన వెంటనే ఇంధన ధరలను పెంచడం ద్వారా సామాన్యులపై భారం మోపుతున్నారని ఆరోపించారు. ఇది ప్రజల నడ్డీవిరిచే విధానమని పేర్కొన్నారు.

## సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పంది రాజు**



**తొగుట:**
ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిరుపేదలకు వరంగా మారిందని, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాపాలనలో సీఎం సహాయనిది పతకానికి బడ్జెట్లో నిధులు పెంచడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పంది రాజు పేర్కొన్నారు. తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సాహకారంతో మంజూరైన రూ.1,24,500 ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం ఆయన పంపిణీ చేశారు. బెజ్జనబోయిన కిష్టయ్య రూ.51,500, తుప్పతి సంపత్ రూ.32,500, రూ.బెజ్జనబోయిన భాగ్య రూ.24,000, రూ.మిద్దె మానస రూ.16,500 లకు పంది రాజు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ బెజ్జనబోయిన ప్రవీణ్, మండల పార్టీ ఉపాధ్యక్షులు అనిల్, గ్రామ పార్టీ అధ్యక్షులు బండారు రమేష్ గౌడ్, నాయకులు పంది నర్సింలు, పోతరాజు రవి, గంగోల్ల ప్రశాంత్, జంగపల్లి స్వామి, వడ్డే నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

